ధరల అదుపునకు చర్యలు

- జిల్లా ఇన్‌ఛార్జీ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఉల్లి, టమోటా సామాన్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్, వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులను జిల్లా ఇన్‌ఛార్జీ కలెక్టర్ నారపురెడ్డిమౌర్య ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో టమోటా, ఉల్లి ధరల నియంత్రణ కమిటీ సమావేశం నారపురెడ్డి మౌర్య అధ్యక్షతన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ... ఉల్లి, టమోటాలను సామాన్య ప్రజలకు అందుబాటులో ఉంచేందుకు టమోటాలను చిత్తూరు నుండి తెప్పించుకొని 'నో లాస్- నో గెయిన్' క్రింద రైతు బజార్లలో అమ్మడంతో పాటు ఉల్లిని కూడా మహారాష్ట్ర నుంచి అవసరాన్ని బట్టి తెప్పించి అమ్ముతామన్నారు. అదే విధంగా రానున్న నెలలో మన జిల్లాలోని రైతులు ఉల్లి, టమోటా పంట వేయడం ద్వారా ఇంకా తక్కువ ధరకు ఉల్లి, టమోటా అమ్మే అవకాశం ఉంటుందన్నారు. అందుకు తగిన చర్యలు తీసుకోవడంతో పాటు ఒకవేళ ధరలు పెరిగినా కూడా అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్, వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులను ఆదేశించారు. రైతు బజార్ల ఎస్టేట్ అధికారులను రైతు బజార్లలో టమోటా, ఉల్లి విక్రయిస్తున్న ధర గురించి అడిగి తెలుసుకోవడంతో పాటు సమావేశానికి హాజరైన హోల్ సేల్ వ్యాపారస్తులను కూడా ధరలను నియంత్రించేందుకు సహకరించాలని కోరారు. మార్కెటింగ్ ఎడి నారాయణ మూర్తి, డిఎస్ఒ మూర్తి, ఎపిఎంఐపి పిడి ఉమాదేవి, హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు పాల్గొన్నారు.

రైతు బజార్‌ను తనిఖీ చేస్తున్న ఇన్‌ఛార్జీ కలెక్టర్ మౌర్య

రైతు బజారులో ఆకస్మికతనిఖీ

నగరంలోని స్థానిక సి క్యాంపులో ఉన్న రైతు బజార్ ను జిల్లా ఇన్చార్జి కలెక్టర్ నారపరెడ్డి మౌర్య బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. టమోటా ఉల్లి విక్రయాలపై ఆమె అడిగి తెలుసుకున్నారు. కూరగాయలు నిర్ణిత ధరల పట్టిక ప్రకారమే అమ్మకాలు చేపట్టాలని అక్కడున్న సిబ్బందిని ఆదేశించారు. రైతుబజారులో పరిశుభ్రత వాతావరణం నెలకొల్పాలని పేర్కొన్నారు. రైతు బజారులో కొంతమంది అమ్మకం దారులు పాడైన కూరగాయలను ఎక్కడంటే అక్కడ పారేయడం వలన అపరిశుభ్రంగా ఉన్నదని, అలాకాకుండా అక్కడనే ఏర్పాటు చేసిన డస్ట్ బిన్‌లలో వేయాలన్నారు. ఎక్కడంటే అక్కడ వేసినట్లయితే సిసి కెమెరాల ద్వారా సంబంధిత వారిని గుర్తించి తగిన చర్యలు తీసుకుంటామని, వారు రైతు బజార్లో అమ్మకాలు చేయకుండా లైసెన్స్ కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. మార్కెటింగ్ ఎడి నారాయణ మూర్తి, రైతు బజార్ల ఎస్టేట్ అధికారులు ఉన్నారు.

సాగని సాగు

- ఇప్పటి వరకూ 12 శాతమే - వర్షాలు పడకపోవడంతో జంకుతున్న రైతులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో ఖరీఫ్ సాగు ముందుకు సాగడం లేదు. జిల్లావ్యాప్తంగా సాధారణ సాగు విస్తీర్ణంలో ఇప్పటి వరకూ 12.11 శాతం విస్తీర్ణంలో మాత్రమే పంటలను సాగు చేశారు. నైరుతి రాకతో ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు కురిసినా.. తరువాత వర్షాలు పడకపోవడంతో విత్తనాలు విత్తేందుకు రైతులు జంకుతున్నారు. జులై 15 వరకూ ఖరీఫ్ పంటలను విత్తుకోవచ్చని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు...

విత్తనం వేసుకోవడానికి సిద్ధం చేసుకుంటున్న రైతు (ఫైల్)

నైరుతి రుతుపవనాల రాకతో ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు విస్తారంగా కురిశాయి. జులై నెలలో సాధారణ వర్షపాతం 77.7 మిల్లీమీటర్లు కాగా ఈనెల 18 వరకూ 139.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఆ తరువాత జిల్లాలో చినుకు జాడ లేకుండా పోయింది. దీంతో ఖరీఫ్‌లో విత్తనాలు విత్తేందుకు రైతులు వెనుకడుగు వేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని పంటల ఖరీఫ్ సాధారణ సాగు 10,48,052.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 1,26,915 ఎకరాల విస్తీర్ణంలో పంటలను సాగు చేశారు. సాధారణ సాగులో 12.11 శాతం మాత్రమే ఇప్పటి వరకూ సాగయింది. జిల్లాలో ఖరీఫ్ ప్రధాన పంట అయిన పత్తి సాధారణ సాగు 6,09,222.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 89,825 ఎకరాల్లో విత్తనాలను విత్తారు. సాధారణ సాగులో 14.74 శాతం పంటను సాగు చేశారు. మరో ప్రధాన పంట అయిన వేరుశనగ సాధారణ సాగు 1,47,422.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ కేవలం 11,920 ఎకరాల్లోనే విత్తనాలను విత్తారు. సాధారణ సాగులో 8.09 శాతం మాత్రమే పంట సాగయింది. వరి సాధారణ సాగు 31,927.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ అసలు సాగు మొదలు పెట్టలేదు. జిల్లాలో మొక్కజొన్న సాధారణ సాగు 11,630 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 3360 ఎకరాల్లో సాగు చేశారు. అంటే సాధారణ సాగులో 28.88 శాతం పంట సాగయింది. కంది సాధారణ సాగు 63,892.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 11,910 ఎకరాల్లో పంటను సాగు చేశారు. సాధారణ సాగులో 18.64 శాతం పంట ఇప్పటి వరకూ సాగయింది. మినుము సాధారణ సాగు 415 ఎకరాలు, పెసలు సాధారణ సాగు 27.5 ఎకరాలు కాగా ఈ ఏడాది ఆ పంటలను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి కనపరచకపోవడంతో ఇప్పటి వరకూ ఆ పంటలను సాగు చేయలేదు. ప్రొద్దుతిరుగుడు సాధారణ సాగు 1955 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 62.5 ఎకరాల్లో సాగు చేశారు. ఆముదం సాధారణ సాగు 23,077.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 2987.5 ఎకరాల్లో పంట సాగైంది. సోయాబీన్ సాధారణ సాగు 307.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 32.5 ఎకరాల్లో సాగు చేశారు. పసుపు సాధారణ సాగు 305 ఎకరాలు సాగా ఆ పంటను సాగు చేసేందుకు రైతులు ముందుకు రాలేదు. దీంతో పంట ఇప్పటి వరకూ సాగు కాలేదు. జిల్లాలో మిరప సాధారణ సాగు 74,995 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 877.5 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. ఉల్లి సాధారణ సాగు 39,245 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 2217.5 ఎకరాల్లో పంట సాగయింది. వాము సాధారణ సాగు 5437.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 55 ఎకరాల్లో మాత్రమే పంటను సాగు చేశారు. టమోటా సాధారణ సాగు 6515 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 190 ఎకరాల్లో టమోటా పంటను వేశారు. జిల్లాలో ఖరీఫ్‌లో ఇతర పంట సాధారణ సాగు 16,862.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 852.5 ఎకరాల్లో ఇతర పంటలను సాగు చేశారు.

చిరు ధాన్యాలదీ అదే పరిస్థితి...

జిల్లాలో ఖరీఫ్‌లో చిరు ధాన్యాల సాగు కూడా అంతంత మాత్రంగానే ఉంది. ఖరీఫ్‌లో జొన్న సాధారణ సాగు 770 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ అసలు విత్తనాలు విత్తలేదు. సజ్జ సాధారణ సాగు 9097.5 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 1260 ఎకరాల విస్తీర్ణంలో మాత్రం సాగు చేశారు. సాధారణ సాగులో 13.85 శాతం పంట సాగైంది. కొర్ర సాధారణ సాగు 4210 ఎకరాలు కాగా ఇప్పటి వరకూ 1342.5 ఎకరాల్లో పంటను సాగు చేశారు. సాధారణ సాగులో 31.86 శాతం పంట సాగైంది. ఖరీఫ్‌కు పంటలను విత్తుకునేందుకు జులై 15 వరకూ అవకాశం ఉంటుందని, అప్పటిలోపు వర్షాలు కురిస్తే పంటలను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతారని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు.

ఖరీఫ్ పంటల సాగు ఇలా..

పంట	సాగు శాతం
వరి	0
జొన్న	0
సజ్జ	13.85
మొక్కజొన్న	28.88
కొర్ర	31.86
కంది	18.64
వేరుశనగ	8.09
ప్రొద్దుతిరుగుడు	3.20
ఆముదం	12.94
పత్తి	14.74
మిరప	1.17
ఉల్లి	5.65
వాము	1.01
ఇతర పంటలు	5.05
మొత్తం	**12.11**

జనాభాకు అనుగుణంగా నిధులివ్వాలి

- 5వ రాష్ట్ర ఆర్థిక సంఘానికి జిల్లా పరిషత్ ఛైర్మన్ వినతి - జిల్లా పరిషత్ హాలులో సమీక్ష

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్

పెరుగుతున్న జనాభాకు , పెరుగుతున్న పనుల అంచనాలకు, భౌతిక పరిస్థితులను పరిశీలించి నిధులు కేటాయించాలని 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం కమిటీకి కర్నూలు ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి విజ్ఞప్తి చేశారు. బుధవారం 5వ రాష్ట్ర ఆర్థిక సంఘం ప్రతినిధి బృందం జిల్లాలో పర్యటించింది. అందులో కమిటీ కార్యదర్శి డాక్టర్ కెవి రమణారెడ్డి, సభ్యులు ప్రొఫెసర్ ప్రసాద రావు, ప్రొఫెసర్ ఎంవిఎస్. పద్మారావు, కాకికృపారావు ఉన్నారు. జిల్లా పరిషత్ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలు అంశాలను ప్రస్తావించారు. ప్రస్తుతమున్న నియమ నిబంధనల మేరకు, మండల ప్రజా పరిషత్తుకు రూ.3 లక్షలవరకు, జిల్లా పరిషత్తు స్థాయీ సంఘాలకు రూ. 5 లక్షల వరకు జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశానికి రూ. 10 లక్షల వరకు అంచనా విలువ కలిగిన పనులకు ఆమోదం తెలిపే అధికారం ఉందన్నారు. ప్రస్తుతం, చేపట్టే పనులకు వినియోగించు వివిధ వస్తు, సామగ్రి విలువలు విపరీతంగా పెరిగిన నేపథ్యంలో, మండల పరిషత్తుకు రూ. 10 లక్షల వరకు, జిల్లా పరిషత్తు స్థాయీ సంఘంలకు రూ.30 లక్షల వరకు , జిల్లా పరిషత్తు సర్వ సభ్య సమావేశానికి రూ. 50 లక్షల మేర అంచనా విలువ కలిగిన పనులకు ఆమోదం తెలిపి నింబంధనలను సవరించాలన్నారు. సీనరేజి ఫీజుకు సంబంధించి జిల్లా పరంగా జమ చేసిన మొత్తాన్ని పంచాయతీ రాజ్ సంస్థలకు వర్గీకరించి విడుదల చేయాలన్నారు. జమ చేసిన మొత్తానికి, విడుదల చేసిన నిధులకు మధ్య వ్యత్యాసం గల మొత్తాన్ని విడుదల చేయాలన్నారు. ఇసుక, అమ్మకాల ద్వారా జమ అయిన సీనరేజి నిధులను అనగా 2019సెప్టెంబర్ 4 నుంచి 2021- ఏప్రిల్ మధ్య కాలానికి సంబంధించి, 2022- ఏప్రిల్ నుండి నేటి వరకు పంచాయతీ రాజ్ సంస్థలకు వర్గీకరించి విడుదల చేయాలన్నారు. గ్రాంట్-ఇన్-ఎయిడ్ రూపంలో తలసరి నిధులకు సంబంధించి, పంచాయతీ రాజ్ సంస్థలకు 2011జనాభా లెక్కల ప్రకారం విడుదల చేస్తున్నారని, అయితే 2021లో నిర్వహించ వలసిన జనగణన నిర్వహించబడనందున నేటికీ 2011 జనాభా లెక్కల ప్రాతిపదికనే విడుదల చేస్తున్నారని, 2011 తరువాత జనాభా పెరుగుదల గణనీయంగా వున్నందున పూర్తి స్థాయిలో జనన గణన నిర్వహించే వరకు 2011 జనాభాపై కొద్ది శాతం పెంపుదలతో తలసరి నిధుల విడుదల ప్రతిపాదన పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. స్టాంపు డ్యూటికి సంబంధించి సర్దుబాటు చేయదగు మొత్తాలను సకాలంలో చేసేలాగా రిజిస్ట్రేషన్ శాఖ వారికి సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. జిల్లా ప్రజా పరిషత్తు ఆధ్వర్యంలో 60 సిపిడబ్ల్యుఎస్ పథకాలు నిర్వహిస్తున్నారని, వీటి నిర్వహణకు వ్యయం ప్రతి సంవత్సరం పెరుగుతున్న దృష్ట్యా విడుదల అయ్యే 15వ ఆర్థిక సంఘం నిధులు ఏ మాత్రం సరిపోవడం లేదన్నారు. పై పెచ్చు పథకాల నిర్వహణకు వినియోగిస్తున్న విద్యుత్తుకు సంబందించిన బిల్లులు హెచ్చు మొత్తంలో పెండింగులో వున్నాయని, పథకాల సక్రమ నిర్వహణకు రాష్ట్ర ఆర్థిక సంఘం నిధుల విడుదల ప్రతిపాదన పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ పంచాయతీ సర్పంచులకు, మండల పరిషత్తు సభ్యులకు, అధ్యక్ష, ఉపాధ్యక్షులకు, జిల్లా పరిషత్తు సభ్యులకు, అధ్యక్ష, ఉపాధ్యక్షులకు గౌరవ వేతనం, అటెండెన్స్ అలవెన్స్, ప్రయాణ భత్యం చెల్లింపునకు బడ్జెట్లు విడుదలకు కృషి చేయాలని కోరారు. జిల్లా పరిషత్ సిఇఒ, నాసర రెడ్డి, జిల్లా అధికారులు, జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జడ్‌పి ఛైర్మన్

ఇంటర్ ఫస్ట్ ఇయర్ సప్లిమెంటరీలో 18వ స్థానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇంటర్మీడియట్ ఫస్టియర్ సప్లమెంటరీ పరీక్ష ఫలితాలు బుధవారం ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులు విడుదల చేశారు. ఈ ఫలితాల్లో కర్నూలు జిల్లా 18వ స్థానంలో నిలిచింది. మొత్తం ఈ పరీక్షలకు 5711 మంది పరీక్షలకు విద్యార్థులు రాయగా 2327 మంది ఉత్తీర్ణులయ్యారు. కేవలం 41శాతం ఉత్తీర్ణత శాతం నమోదయింది. ఒకేషనల్ విభాగంలో 726 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 278 మంది ఉత్తీర్ణులయ్యారు. 39 శాతం ఉత్తీర్ణత శాతం నమోదయింది.

వ్యవసాయ పంప్ సెట్లకు విద్యుత్ కనెక్షన్లు

- ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఉమాపతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కొత్తగా ఏర్పడిన ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈనెల 25 వరకు మొత్తం రుసుం చెల్లించిన 8,532 వ్యవసాయ పంపుసెట్ల విద్యుత్ కనెక్షన్ల పనులు పూర్తి చేయుటకు సన్నాహాలు చేస్తున్నామని ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ఎం.ఉమాపతి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ 2024 కారణంగా కొత్తగా వ్యవసాయ కనెక్షన్లకు అప్లయి చేసిన వారికి డిమాండ్ నోటీసు , శాంక్షన్ పత్రాలు ఆపి ఉన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ పూర్తయిన కారణంగా వీటిని తక్షణమే సాంక్షన్ చేసి ఆయా కనెక్షన్లకు దరఖాస్తు చేసిన వారికి డిమాండ్ నోటీసులు పంపమని ఆదేశించి ఉన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

పధాన మంత్రిని కలిసిన కర్నూలు ఎంపీ

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ప్రధానమంత్రి మోడీని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు మర్యాద పూర్వకంగా కలిసారు. పార్లమెంట్ సమావేశాల్లో భాగంగా ఢిల్లీలో ఉన్న నాగరాజు కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుతో పాటు ఇతర టిడిపి ఎంపిలతో కలిసి ప్రధాన మంత్రి కార్యాలయంలో మోదీని కలిశారు. కురబ సామాజిక తరగతికి చెందిన కండువా తో సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపి నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధితో పాటు కర్నూలు జిల్లా అభివృద్ధికి సహాయ సహకారాలు అందించాలని కోరానని, దీని పై ప్రధాని సానుకూలంగా స్పందించారని తెలిపారు.

ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలి

పలు ప్రాంతాల్లో నీటి నాణ్యతను పరీక్షించిన కమిషనర్ ఎ.భార్గవ్ తేజ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగర ప్రజలకు సురక్షిత, స్వచ్ఛమైన తాగునీటిని అందించడమే తమ ధ్యేయమని నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భార్గవ్ తేజ అన్నారు. బుధవారం నగరంలో పూలబజార్, స్వామిరెడ్డి నగర్, లక్ష్మి నగర్, శరీన్‌నగర్ గీతాముఖర్జీ నగర్ తదితర ప్రాంతాల్లో ఇంజినీరింగ్ అధికారులతో కలిసి తాగునీటిలో అవశేష క్లోరిన్‌ను కమిషనర్ పరీక్షించారు. అతిసార వ్యాపించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. నీటి నాణ్యతలను ప్రతిరోజూ పరీక్షించాలన్నారు. సరఫరాలో కలుషితానికి ఆస్కారం లేకుండా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంఇలు శేషసాయి, షాకీర్, డిఇఇలు రవిప్రకాష్ నాయుడు, నరేష్, ఎఇలు జనార్ధన్, భాను తదితరులు పాల్గొన్నారు.

హైర్ బస్ డ్రైవర్లకు వేతనాలు పెంచాలి : సిఐటియు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల కంటే ముందు ఇచ్చిన హామీలో భాగంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తే హైర్ బస్ డ్రైవర్లుగా పనిచేస్తున్న కార్మికులకు వేతనాలు పెంచాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు డిమాండ్ చేశారు. హైర్ బస్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు యు .శ్రీనివాసులు అధ్యక్షతన బుధవారం కార్మిక కర్షక భవన్ లో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అంజిబాబు మాట్లాడుతూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడం వల్ల 30 నుండి 40 శాతం ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అన్నారు. దీని వల్ల బస్సు ప్రయాణం చేసే సమయం పెరుగుతుందని అన్నారు. డ్రైవర్‌కు అదనపు భారం ,ఎక్కువ టైం పనిచేయవలసి వస్తుందని అన్నారు. డ్రైవర్లకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఆర్‌టిసి సంస్థలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటన చేసిందని దాని అమలుకు కృషి చేయాలని, ఔట్ సోర్సింగ్ కార్మికులతో పాటు డ్రైవర్లకు కూడా బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. గతంలో ఆర్టీసీ రాబడిలో రెండు శాతం ఇన్సెంటివ్ హెయిర్ బస్ డ్రైవర్లకు ఇచ్చేవారని, దానిని గత జగన్ ప్రభుత్వం రద్దు చేసిందని మళ్లీ దానిని పునరుద్ధరించాలని కోరారు. మహిళలకు ఉచితంగా ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల అదనంగా బస్సులు ఏర్పాటు చేయాల్సి వస్తుందని,ఉద్యోగుల సంఖ్య కూడా పెంచవలసి వస్తుందని, అదనంగా బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు ఆర్టీసీలో బస్సులకు తీసుకునే డ్రైవర్ పోస్టులలో ముందుగా హెయిర్ బస్ కార్మికులకు అవకాశం కల్పించాలని కోరారు. బస్ డ్రైవర్లు ఉచిత ప్రయాణం దూరాన్ని 50 కిలోమీటర్ల వరకు పెంచాలని కోరారు. రాబోవు కాలంలో ఈ డిమాండ్ల సాధనకు ఆందోళన చేస్తామన్నారు. హైర్బస్ యూనియన్ జిల్లా నాయకులు ఎస్.శ్రీనివాసులు, సుబ్బయ్య గౌడ్, శేఖర్ ,చెన్నకేశవులు, సాయిబాబా తదితరులు పాల్గొన్నారు.

గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి

డాక్టర్ శంకర్‌శర్మ పుట్టినరోజు సందర్భంగా క్రీడాకారులకు బెల్ట్‌ల ప్రదానం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జీవితంలో గెలుపు ఓటములను సమానంగా స్వీకరించి ఎలాంటి ఒడిదుడుకులనైనా ఎదుర్కొనే తత్వాన్ని క్రీడలు పెంపొందిస్తాయని సీనియర్ గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ అన్నారు. కర్నూలు నగరంలోని భాష్యం పాఠశాలలో ఆయన పుట్టినరోజు సందర్భంగా కరాటే క్రీడాకారులకు బెల్టులను ప్రదానం చేశారు. భాష్యం పాఠశాలల జోనల్ ఇంచార్జ్ అనిల్ కుమార్, ప్రిన్సిపల్ శ్రవణ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు మాధవి, సీనియర్ కరాటే శిక్షకులు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శంకర్ శర్మ మాట్లాడుతూ తన పుట్టినరోజు సందర్భంగా భాష్యం పాఠశాలలో క్రీడాకారులకు బెల్టులను ప్రదానం చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. ప్రతి ఒక్కరు సొంత లాభాన్ని కొంత మానుకొని పొరుగు వారికి సేవ చేయడం అలవాటు చేసుకోవాలని సూచించారు. తాను వైద్య వృత్తిలో ఉన్నప్పటికీ సామాజిక సేవను ప్రవృత్తిగా మార్చుకుని ముందుకు సాగుతున్నానని తెలిపారు. మొదట తాను చిన్న పిల్లల వైద్యుడిగా చిన్నారులకు సేవలు అందించానని, ప్రస్తుతం గ్యాస్ట్రోఎంట్రాలజిస్ట్‌గా జీర్ణకోశ, కాలేయ వ్యాధులకు వైద్య సేవలు అందిస్తున్నట్లు వివరించారు. కరాటే లాంటి మార్షల్ ఆర్ట్స్‌లో సాధన చేయడం వల్ల మానసిక, శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించారు. ఈ క్రీడలో సుదీర్ఘంగా శ్వాస తీసుకోవడం వల్ల ఆరోగ్యపరంగా అనేక ఉపయోగాలు ఉన్నా యన్నారు. ఇందులో ధ్యానం, ప్రాణాయామం వంటివి ఆరోగ్యాన్ని పెంపొందించే అంశాలు ఉన్నాయని చెప్పారు. ఇటీవల కాలంలో సరైన వ్యాయామం లేకపోవడం వల్ల జీవన శైలికి సంబంధించిన అనేక అనారోగ్య సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని తెలిపారు. అధిక బరువు, బీపీ, షుగర్ వంటి దీర్ఘకాలిక వ్యాధులు చాలా మందిలో వస్తున్నాయని వివరించారు. క్రీడల్లో పాల్గొనేవారు గెలుపు ఓటములను సమానంగా స్వీకరించే తత్వాన్ని అలవర్చుకుంటారన్నారు. జీవితంలో ఎలాంటి వైఫల్యాలు ఎదురైనా తట్టుకునే శక్తి పెంపొందుతుందని చెప్పారు. భాష్యం పాఠశాలలో చిన్నపిల్లల మధ్య తన పుట్టినరోజును జరుపుకోవడం మరిచిపోలేని అనుభూతిని కలిగిస్తుందని డాక్టర్ శంకర్ శర్మ తెలిపారు.

క్రీడాకారులకు బెల్టులు ప్రదానం చేస్తున్న డాక్టర్‌శంకర్‌శర్మ, భాష్యం పాఠశాల ప్రిన్సిపల్ శ్రవణ్‌కుమార్, హెచ్ఎం మాధవి, (చిన్నారుల మధ్య పుట్టిన రోజున కేక్ కట్‌చేసిన శంకర్‌శర్మ)

డాక్టర్ శంకర్‌శర్మకు బర్త్‌డే శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రజాశక్తి సిబ్బంది పానుగంటి చంద్రయ్య, ఎల్లాగౌడ్ , రాకేష్

ప్రారంభ దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను నయం చేయొచ్చు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

క్యాన్సర్ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తిస్తే నయం చేసుకునే అవకాశాలు అధికమని జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి హేమలత అన్నారు. బుధవారం కర్నూలు మెడికల్ కాలేజీ ఆవరణలోని న్యూ లెక్చరర్ గ్యాలరీలో క్యాన్సర్ స్క్రీనింగ్ మూడవ బ్యాచ్ శిక్షణ కార్యక్రమంలో జిల్లా ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి డాక్టర్ హేమలత మాట్లాడారు. ప్రారంభ దశలో గుర్తిస్తే క్యాన్సర్ నయం చేసుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందన్నారు. తొలి దశలో గుర్తించడం ఎంతో ముఖ్యమన్నారు. సిస్టర్ స్థాయిలో నిర్ధారిత సమయాల్లో క్యాన్సర్ స్క్రీన్ టెస్ట్‌ను ప్రజలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. మారుతున్న ఆహారపు అలవాట్లు శారీరక శ్రమ లేకపోవడం ధూమపానం మద్యపానం పర్యావరణ కాలుష్యం క్యాన్సర్ రావడానికి కారణమని తెలిపారు. డాక్టర్ శైలేష్ కుమార్ మాట్లాడుతూ పెళ్లికి ముందు హెచ్‌పివి వ్యాక్సిన్‌ను వేయించడం ద్వారా వ్యాధి రాకుండా నివారించవచ్చని తెలిపారు. మహిళలు తరచూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. గర్భాశయములోని కణాలు అసాధారణంగా , నియంత్రణ లేకుండా విభజించబడి పెరుగుదల ఏర్పడినప్పుడు దానిని క్యాన్సర్ అంటారని తెలిపారు. గర్భాశయ క్యాన్సరుకు సకాలంలో చికిత్స చేయకపోతే అది బాధాకరమైన మరణానికి దారితీస్తుందని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, సామాజిక ఆరోగ్య అధికారులు, మహిళా ఆరోగ్య కార్యకర్తలు ఖలీల్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్‌సిడి అధికారి డాక్టర్ హేమలత

ఇంటర్ సప్లమెంటరీలో శ్రీచైతన్య విజయపరంపర

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఇంటర్ ప్రథమ సంవత్సర సప్లమెంటరీ పరీక్షా ఫలితాలలో శ్రీ చైతన్య విద్యార్థులు విజయపరంపర కొనసాగించారని శ్రీచైతన్య కళాశాలల ఎజిఎం మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఎంపిసి విభాగంలో 470 మార్కులకు గాను ఎం. సాయి లిఖిత 467 మార్కులు, ఎ.నందిని 467 మార్కులతో రాష్ట్ర ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారని తెలిపారు. అదే విధంగా డి. పవన్ కుమార్ 466 మార్కులు, కెడి. దరహాస్ 466 మార్కులు సాధించారని తెలిపారు. తమ వద్ద ఎంపిసి విభాగంలో ప్రతి ముగ్గురిలో ఒకరికి 410, ఆ పైన మార్కులు సాధించారని తెలిపారు. జూనియర్ బైపిసి విభాగంలో 440 మార్కులకు గాను ఎస్ఎన్. హర్షిత యాదవ్ 436 మార్కులు, ఎ. మంజులత 436, కె. ప్రేమ్ కుమార్ 435, పి.పూజిత 435, ఎం.రవిత్రయిని 435 లాంటి ఎన్నో ఉత్తమ మార్కులు సాధించారని తెలిపారు. తమ వద్ద బైపిసి. విభాగంలో ప్రతి ముగ్గురిలో ఒకరికి 400, ఆ పైన మార్కులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను , ఉపాధ్యాయులను కళాశాల డీన్స్ బాలాజీ , సరళ అభినందించారు.

జూనియర్ ఎంపిసిలో: 467 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు ఇద్దరు, 466 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు నలురుగు, 465 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు 40మంది, 464 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు 16 విద్యార్థులు, 463 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు -57 మంది, 462 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు - 71 విద్యార్థులు, 461 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు- 93 మంది, 460 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు - 111 సాధించారన్నారు.

జూనియర్ బైపిసిలో : 436 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులుఇద్దరు ఇద్దరు, 435 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు ఐదురుగు, 434 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు 10 మంది, 433 ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు 17 మంది, 430 మరియు ఆ పైన మార్కులు సాధించిన విద్యార్థులు-36 మంది ఉన్నారు.

ఎంపిడిఒను విధుల నుంచి తొలగించాలి

సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి

ప్రజాశక్తి- పత్తికొండ : పత్తికొండ ఎంపిడిఒ రామారావును విధుల నుండి వెంటనే తొలగించాలని సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం విలేకరులతో సిపిఎం మండల కార్యదర్శి రంగారెడ్డి మాట్లాడుతూ పత్తికొండ మండలం గ్రామీణ ప్రాంతాలలో డ్రైనేజీ వ్యవస్థలు అస్తవ్యస్తం కావడం, దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నరని, పట్టించుకోవడం లేదని అన్నారు. పంచాయతీ సెక్రటరీలు ఎంపిడిఒ మొక్కుబడిగా విధులు నిర్వహిస్తున్నారని విమర్శించారు. అతిసారతో అనేకమంది రోగులు ఇబ్బందులు పడుతున్నారని, దోమలతో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. నివారణ చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలం చెందారని అన్నారు. గ్రామాలలో స్వచ్ఛభారత్ కార్మికులు లేకపోవడంతో ఎక్కడబడితే అక్కడ చెత్తాచెదారం దోమలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బ్లీచింగ్ పౌడర్ చల్లడం, దోమల మందు స్ప్రే చెయ్యకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ అనారోగ్యాలకు పాలవుతున్నారని వివరించారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకుని తగు చర్యలు తీసుకోవాలన్నారు.

బుక్ కీపర్లకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జీవనోపాధిపై అవగాహన అవసరం

- ఎపిఎం నాగార్జున

ప్రజాశక్తి - చిప్పగిరి

జీవనోపాధిపై ప్రతి మహిళా అవగాహన కలిగి ఉండాలని ఎపిఎం నాగార్జున తెలిపారు. బుధవారం ఎపిఎం నాగార్జున ఆధ్వర్యంలో విలేజ్ బుక్ కీపర్లకు చిప్పగిరి వెలుగు కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీవనోపాధులు అంటే బర్రెలు, ఆవులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకం, వీటి పెంపుదలపై అవగాహన పెంచుకోవాలని తెలిపారు. రుణాలు పొంది వ్యాపారాల్లో మంచి ప్రతిభ కనబరిచిన సంఘాలకు గ్రేడింగ్ ఇస్తామన్నారు. లోకోస్ యాప్‌లో సంఘాలను నమోదు చేయాలని తెలిపారు. గ్రామ సంఘాలు సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. బ్యాంకు లింకేజీ, సిఐ యాప్, ఉన్నతి రికవరీ గురించి తెలుసుకోవాలని అన్నారు. సంఘాలకు విజన్ బిల్డింగ్ ట్రైనింగ్ అవసరమని తెలిపారు. ఉన్నతాధికారులు తెలిపిన విషయాలపై గ్రామాల్లో పొదుపు సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించి అవగాహన కల్పించే బాధ్యత బుక్ కీపర్లపై ఉందన్నారు. సిసిలు రాధమ్మ, లక్ష్మన్న, శారదమ్మ పాల్గొన్నారు.

అధిక ధరకు అమ్మితే లైసెన్స్ రద్దు

- ఎడిఎ సునీత

రికార్డులు తనిఖీ చేస్తున్న ఆలూరు ఎడిఎ సునీత

ప్రజాశక్తి - ఆస్పరి

రైతులకు అధిక ధరలకు ఎరువులు అమ్మితే లైసెన్స్ రద్దు చేస్తానని ఆలూరు ఎడిఎ సునీత హెచ్చరించారు. బుధవారం ఎడిఎ సునీత ఆస్పరిలోని ఫర్టిలైజర్స్ షాపులను, రికార్డులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. రైతులకు నకిలీ విత్తనాలు, అధిక ధరకు ఎరువులు, ఎక్స్ పైర్ డేట్ నీలి మందులు అమ్మినట్లు తెలిస్తే లైసెన్స్ రద్దు చేసి ఫర్టిలైజర్ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఆర్‌పి ధరకే రైతులు అమ్మాలని సూచించారు. రైతులు కూడా నీలి మందులు, ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన తర్వాత బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎఒ నరేంద్ర కుమార్, ఎంపిఇఒ వెంకటేష్ పాల్గొన్నారు.

జర్నలిస్టు పిల్లలకు ఫీజులో రాయితీ ఇవ్వాలి

- ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

వినతిపత్రం అందిస్తున్న ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు

జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ కల్పించాలని ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు కోరారు. బుధవారం ఎపిడబ్ల్యుజెఎఫ్ ఆధ్వర్యంలో ఎంఇఒ ఆంజనేయులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎపిడబ్ల్యుజెఎఫ్ తాలూకా అధ్యక్షులు షబ్బీర్ మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వాలకు, ప్రజలకు వారధులుగా పని చేసే ప్రతి వర్కింగ్ జర్నలిస్టు పిల్లలకు ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజుల్లో ప్రభుత్వం రాయితీ కల్పించాలని కోరారు. అలాగే ఎమ్మిగనూరులో ప్రయివేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, దీనిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంఇఒ మాట్లాడుతూ... ఈ విషయమై ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యంతో మాట్లాడతానని తెలిపారు. జర్నలిస్టుల పిల్లలకు 60 శాతం రాయితీ కల్పించే ప్రయత్నం చేస్తానని హామీఇచ్చారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ తాలూకా అధ్యక్షులు షబ్బీర్, ఇలియాస్, మురళీ, ఖలీల్, చెన్నయ్య, రమేష్, సురేంద్ర పాల్గొన్నారు.

ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం

- ఉన్నత విద్యకు దూరమవుతున్న బాలికలు

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వ అనాలోచిత నిర్ణయం వల్ల ఆదోని పట్టణంలో బాలికలు ఉన్నత చదువుకు దూరమయ్యే ప్రమాదం ఏర్పడింది. పాఠశాలలు విలీనం చేశారు తప్ప ఆ ప్రాంతంలో ఉన్న విద్యార్థులకు ఉన్నత చదువు ఎలా అన్నది అధికారులు గ్రహించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనం.

నెహ్రూ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్‌లో పెట్టిన 'నో అడ్మిషన్' బోర్డు

నో అడ్మిషన్లు అంటున్న ప్రధానోపాధ్యాయులు

ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్లు లేవు. విద్యార్థుల తాకిడికి తట్టుకోలేక ఉపాధ్యాయులు బోర్డు పెట్టేశారు. ఆ పాఠశాలకు విద్యార్థులు క్యూ కడుతూనే ఉన్నారు. బడులు తెరిచి వారం రోజులు కూడా కాలేదు. అప్పుడే పాఠశాలలో అడ్మిషన్లు పూర్తయ్యాయని, 'అడ్మిషన్స్ ఆర్ క్లోజ్డ్' అంటూ నోటీస్ బోర్డు పెట్టేశారు. పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు 1,656 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో కొత్తగా 350 మందికిపైగా ఇప్పటికే చేరారు. ఇతర తరగతులకు మరో 50 మంది చేరారు. ఒక్కో తరగతి గదిలో 120 నుంచి 130 మంది కూర్చుంటున్నారు. 80 మందికి మాత్రమే సరిపడ తరగతి గదిలో అలాగే సర్దుకొని కూర్చుంటున్నారు. ఈ ఒక్క పాఠశాలనే కాదు.. పురపాలక పరిధిలోని మున్సిపల్ హైస్కూల్, ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక ఉన్నత పాఠశాల, అండర్‌పేట ఉర్దూ బాలికల పురపాలక ఉన్నత పాఠశాలలో ఇదే పరిస్థితి. ఉన్నత పాఠశాలలు కేవలం నాలుగు మాత్రమే ఉండడంతో పట్టణ, గ్రామీణ ప్రాంత విద్యార్థులు అడ్మిషన్ల కోసం అవస్థలు పడుతున్నారు. ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు 4, యుపి పాఠశాలలు 4 మూతపడ్డాయి. ప్రభుత్వం యుపి పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయకపోవడం, ఎయిడెడ్ పాఠశాలలు మూతపడడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. మరోవైపు గతం కంటే ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫారం ఇస్తుండడంతో విద్యార్థులు ప్రయివేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకే ఆసక్తి చూపుతున్నారు.

అప్‌గ్రేడ్ చేయకపోవడం

పాఠశాలలో చేరేందుకు క్యూ కడుతున్న విద్యార్థులు

ప్రభుత్వం ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేయకపోవడంతో ఉన్నత పాఠశాలల కొరత తీవ్రంగా ఉంది. పట్టణంలో 41 వార్డులు, 2.30 లక్షల జనాభాతోపాటు పట్టణ శివారు ఆనుకుని ఉన్న గ్రామాలైన మండగిరి, సాదాపురం, బసాపురం, పర్వతాపురం, ఇస్వీ నుంచి కూడా విద్యార్థులు చేరేందుకు వస్తున్నారు. ఉన్న నాలుగు పురపాలక ఉన్నత పాఠశాలల్లో ఒకటి ఉర్దూ బాలికల పాఠశాల, ఉన్న మూడు పాఠశాలలపైనే తాకిడి ఎక్కువైంది. కిలిచిన పేట పురపాలక ప్రాథమికోన్నత పాఠశాలను, విక్టోరియా పేటలోని 18వ వార్డు పురపాలక ప్రాథమికోన్నత పాఠశాల, ఆది ఆంధ్ర ప్రాథమికోన్నత పాఠశాల, ప్రకాష్ నగర్‌లోని పురపాలక ప్రాథమికోన్నత పాఠశాలను అప్‌గ్రేడ్ చేస్తే 10వ తరగతి వరకు అక్కడే చదువుకుంటారని తల్లిదండ్రులు చెబుతున్నారు.

విద్యకు దూరమవుతున్న బాలికలు

హనుమాన్ నగర్, వాల్మీకి నగర్ విద్యార్థులు మున్సిపల్ హైస్కూల్‌కు రావాలంటే 5 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ట్రాఫిక్‌లో చదువుకోడానికి పంపేందుకు తల్లిదండ్రులు విముఖత చూపడం వల్ల బాలికలు ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉంది. అక్కడ విద్యార్థుల సౌకర్యార్థం కిలిచిన పేటలోని ఉన్న పాఠశాలను హైస్కూల్‌గా మార్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు. విద్యార్థులకు ఉన్నత పాఠశాలల కొరత కూడా ఉండదు.

భర్తీకాని ఉపాధ్యాయ పోస్టులు

నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాలలో 1900 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. అక్కడ కేవలం 36 మంది మాత్రమే ఉపాధ్యాయులు ఉన్నారు. ఎప్పుడో పదేళ్ల క్రితం 1,100 మంది విద్యార్థులకు సరిపడే ఉపాధ్యాయులు నేటికీ అంతేమంది కొనసాగుతున్నారు. 56 మంది ఉపాధ్యాయులు అవసరం కాగా కేవలం 36 మంది మాత్రమే ఉన్నారు. తరగతి గదులు కూడా సరిపడనంత లేవు. నాడు-నేడు కింద అదనపు గదులు నిర్మిస్తున్నా నిధులు లేనితో నిలిచిపోయాయి. మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 1,740 మంది విద్యార్థులున్నారు. 49 మంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. ఇక్కడ కూడా ఉపాధ్యాయులు, గదుల కొరత తీవ్రంగా ఉంది. ఆర్ఆర్ లేబర్ కాలనీ పురపాలక పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 900 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ కేవలం నలుగురు ఉపాధ్యాయులే ఉన్నారు. తరగతి గదులు 8 మాత్రమే ఉన్నాయి. నాడు-నేడు కింద 14 అదనపు గదులు మంజూరు కాగా 8 గదులు పూర్తి చేసుకున్నారు. మరో ఆరు గదులు నిర్మాణంలోని ఆగిపోయాయి. అండర్‌పేట ఉర్దూ బాలికల ఉన్నత పాఠశాలలోనూ ఇదే పరిస్థితి. సబ్జెక్టు టీచర్లు కూడా లేని పరిస్థితి. గత 12 ఏళ్లుగా డీఎస్సీ పోస్టులు భర్తీ చేయలేదు. ఏటేటా విద్యార్థుల సంఖ్య పెరుగుతూనే ఉంది. విద్యార్థుల సంఖ్యకనుగుణంగా ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

రోజూ వస్తూనే ఉన్నారు

- అలీం సిద్ధికి, ప్రధానోపాధ్యాయులు, నెహ్రూ మెమోరియల్ పాఠశాల, ఆదోని

ఆరో తరగతిలో చేరేందుకు రోజూ విద్యార్థులు వస్తూనే ఉన్నారు. సమాధానం చెప్పలేకనే అడ్మిషన్ లేదని బోర్డు పెట్టాల్సి వచ్చింది. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి. ఏటా అడ్మిషన్ లేవని బోర్డు పెట్టాల్సి వస్తోంది. తరగతి గదిలో విద్యార్థులు కూర్చోవడానికి స్థలం లేని పరిస్థితి ఉంది. పట్టణంలో నాలుగే పురపాలక ఉన్నత పాఠశాలలు ఉండడం, వైఎంకె, టిజిఎల్, జీవేశ్వర ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలు మూతపడడంతో విద్యార్థుల తాకిడి పెరిగింది. గదులు, ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. ప్రభుత్వం యుపి పాఠశాలలో అప్ గేడ్ చేస్తే బాగుంటుంది.

అందరికీ అడ్మిషన్ ఇవ్వాలి

- శ్రీనివాసులు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు

చదువుకుంటామని పాఠశాలలకు వచ్చే విద్యార్థులందరికీ అడ్మిషన్లు కల్పించాలి. సౌకర్యాలు లేవని, ఉపాధ్యాయుల కొరత ఉందని సాకులు చూపి విద్యార్థులను వెనక్కి పంపితే ఆందోళన చేస్తాం. హనుమాన్ నగర్, వాల్మీకి నగర్ విద్యార్థుల సౌకర్యార్థం ఆ ప్రాంతంలో హైస్కూల్ ఏర్పాటు చేయాలి. పాఠశాల విలీనం సమయంలో వినతులు ఇచ్చినా అధికారులు పెడచెవిన పెట్టారు. విద్యార్థులను ఇబ్బందులకు గురి చేసినట్లు తెలిస్తే అక్కడే ఆందోళన చేస్తాం.

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో 'వైష్ణవి' ప్రభంజనం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో వైష్ణవి అకాడమీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. వైష్ణవి అకాడమీ ఛైర్మన్ జి.విష్ణు ప్రభు, వైష్ణవి గ్రూప్ ఛైర్మన్ జీడి లింగప్ప, కరస్పాండెంట్ సత్య సిరి, వైష్ణవి అకాడమీ కోఆర్డినేటర్ రవీంద్రనాయక్ బుధవారం విద్యార్థులను అభినందించారు. అకాడమిక్‌లో ఎంపిసికి చెందిన సి.విగ్నేష్ 470 మార్కులకు గాను 466 మార్కులు, బైపిసికి చెందిన కె.సౌభాగ్యమ 440 మార్కులకు గాను 432, అలాగే ఎంపిసికి చెందిన జి.జ్ఞాన ప్రసూన 470 మార్కులకు గాను 464 మార్కులు, ఎంపిసికి చెందిన జి.అజయ్ కుమార్ 470 మార్కులకు గాను 464 మార్కులు సాధించి పట్టణ కళాశాల టాపర్లుగా నిలిచారు. ఈ ఫలితాలు మరిన్ని మంచి ఫలితాలు తీసుకురావడానికి ఎంతో తోడ్పడతాయని అన్నారు. తమ అకాడమీ విద్యార్థులకు జెఇఇ అడ్వాన్స్ నీట్ సీట్లు సాధించడమే లక్ష్యంగా పెట్టుకుని ముందుకు పోతామన్నారు. ప్రిన్సిపల్ మునెప్ప, కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



మంచి మార్కులు సాధించిన విద్యార్థులు

విద్యార్థులను అభినందిస్తున్న డిజిఎం గోవర్ధన్ రెడ్డి, ఎమ్మిగనూరు ఎజిఎం రమణా రెడ్డి

ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో
'నారాయణ' విజయ దుందుభి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

రాష్ట్ర ప్రభుత్వం ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో పట్టణంలోని నారాయణ కళాశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఫలితాల్లో నారాయణ కళాశాల విద్యార్థులు టౌన్ ఫస్ట్ టాపర్‌గా జి.గాయత్రి 465, టౌన్ ద్వితీయ స్థానం ఎన్.శివాని 464, ఎస్.హిమప్రియ 464 మార్కులతో, లక్ష్మీ ప్రసన్న 461, కె.శ్రీహర్షిని 461 తరువాతి స్థానాల్లో నిలిచారు. వీరితోపాటు 55 మంది విద్యార్థులు 400కి పైగా మార్కులు సాధించినట్లు యాజమాన్యం తెలిపింది. 88.38 శాతం ఉత్తీర్ణత శాతంతో నారాయణ విద్యార్థులు విజయదుందుభి మోగించారు. విజయం సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి నారాయణ కళాశాల డిజిఎం గోవర్ధన్ రెడ్డి, డీన్ ఆంజనేయ రెడ్డి, విశ్వనాథ్ రెడ్డి, ఎమ్మిగనూరు నారాయణ కళాశాల ఎజిఎం రమణా రెడ్డి, ప్రిన్సిపల్ రామ్మోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపల్ బాబాలు బుధవారం అభినందించారు.

రైతులు సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోవాలి

- సిఇఒలు ఖాజా హుస్సేన్, వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - మంత్రాలయం

సహకార సంఘం సిఇఒలు ఖాజా హుస్సేన్, వెంకటేశ్వర్లు

మండలంలోని మంచాల, కల్లుదేవకుంట ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో సభ్యత్వం ఉన్న రైతులు తమ పేర్లను రెన్యువల్ చేసుకోవాలని ఆ సంఘాల సిఇఒలు టి.ఖాజా హుస్సేన్, బి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బుధవారం వారు వారి వారి కార్యాలయాల్లో ప్రజాశక్తితో మాట్లాడారు. సహకార సంఘాల్లో సభ్యత్వం యథావిధిగా కొనసాగించాలంటే రైతులు తమకు చెందిన భూముల పట్టాలు, సహకార సంఘాల పాసు పుస్తకాలు, ఆధార్ కార్డులు, పాన్ కార్డు జిరాక్స్ కాపీలతో పాటు రైతు ఫొటోలను రెండు చొప్పున తెచ్చి ఇవ్వాలని కోరారు. సభ్యత్వాన్ని రెన్యువల్ చేసుకోకుంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రాయితీలు వర్తించవని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన కంప్యూటరీకరణలో భాగంగా సభ్యత్వం కలిగిన ప్రతి రైతూ తమ వివరాలను ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం రెండు సొసైటీల్లో సుమారు వెయ్యి చొప్పున రైతులు సభ్యత్వం కలిగి ఉన్నారని పేర్కొన్నారు.

మాదకద్రవ్యాల ఉచ్చులో యువత

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

ఆదోనిలో ర్యాలీ నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ధూమపానం, మద్యపానంతో సరదాగా ప్రారంభమైన వ్యసనంతో యువత మాదకద్రవ్యాల ఉచ్చులో పడడం ఆందోళనకరమని ఆదోని సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ పేర్కొన్నారు. బుధవారం ఆదోని ఆర్ట్స్ కళాశాలలో సెబ్, పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తాత్కాలిక ఉపశమనం కోసం జీవితాలను అంధకారం చేసుకోవద్దని తెలిపారు. డ్రగ్స్‌లో ఉండే టెట్రాహైడ్రోకెనబినాయిడ్ రసాయనం వ్యవనాలకు బానిసలుగా చేస్తుందని చెప్పారు. శారీరకంగా, మానసికంగా సమస్యలు ఎదుర్కొంటారన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైన వారి సమాచారం అందిస్తే నివారణ కేంద్రాలకు అధికారికంగా పంపుతామన్నారు. ఒకప్పుడు పట్టణాలు, నగరాలకే పరిమితమైన మత్తుపదార్థాల జాఢ్యం ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాలకు పాకడం ఆందోళన కలిగిస్తోందన్నారు. తల్లిదండ్రులు, ఇంట్లో పెద్దలు పిల్లలను నిత్యం గమనిస్తూ వారు చెడుదారుల్లో వెళ్లకుండా జాగ్రత్త వహించాలని కోరారు. మాద్రవ్యాలతో కలిగే దుష్ప్రయోజనాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆర్ట్స్ కళాశాల నుంచి జిమ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ట్రెయినీ డీఎస్పీ ధీరజ్, ప్రిన్సిపల్ మురళీ మోహన్, సెబ్ సిఐ విన్నీలత, సిఐలు శ్రీధర్, తేజామూర్తి, నిరంజన్ రెడ్డి, మంజునాథ్, పోలీసు అధికారులు పాల్గొన్నారు. **గోనెగండ్ల**లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మాదకద్రవ్యాలు వాడడం వల్ల కలిగే దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ రామ కృష్ణయ్య మాట్లాడారు. తెలిసి తెలియని తనంతో విద్యార్థులు, యువత మత్తుకు బానిసై మాదకద్రవ్యాల బారిన పడితే వారి బంగారు భవిష్యత్తు బుగ్గిపాలవుతుందని తెలిపారు. మాదకద్రవ్యాల చట్టం, శిక్షల గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాల జోలికి వెళ్లకుండా ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాల గురించి సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నెంబర్ 14500 లేదా గోనెగండ్ల సిఐకి సమాచారం ఇవ్వాలని కోరారు. కళాశాల ప్రిన్సిపల్ పరమేశ్వర రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు. **హొళగుంద**లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రపంచ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ, ఎస్ఐ పెద్దయ్య నాయుడు మాట్లాడారు. మాదకద్రవ్యాల వాడకం వల్ల జ్ఞాపక శక్తి క్షీణిస్తుందని విద్యార్థులకు సూచించారు. మంచి పౌరులుగా ఎదిగి సమాజానికి ఉపయోగపడాలంటే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. **కోసిగి** జిల్లా పరిషత్ ఉన్నత (బాలురు, బాలికల) పాఠశాల విద్యార్థులతో కలిసి సెబ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైఎస్ఆర్ సర్కిల్‌లో మానవహారం ఏర్పాటు చేసి విద్యార్థుల చేత మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సెబ్ సిఐ ఎస్.మహబూబ్ బాష, కోసిగి ఎస్ఐ సతీష్ కుమార్, డాక్టర్ నిరంజన్ రెడ్డి మాట్లాడారు. బాపురం చెక్‌పోస్ట్ సెబ్ ఎస్ఐ నారాయణ స్వామి, కోసిగి ఎస్ఐ ఎన్.రమేష్ బాబు పాల్గొన్నారు. **ఆలూరు**లో సివిల్ అండ్ సెబ్ పోలీసుల ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కలశాల, బాయ్స్-1, 2, మోడల్ స్కూల్ విద్యార్థులతో ప్లకార్డులు, నినాదాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశ్వర్లు, సెబ్ సిఐ సోమశేఖర్ మాట్లాడారు. విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు, విలాసాలకు దూరంగా ఉండాలని సూచించారు. క్రమశిక్షణతో ఉన్నత చదువులు చదివి, ఉన్నత స్థాయికి ఎదిగి తల్లిదండ్రులకు, గురువులకు మంచిపేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. **కౌతాళం** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి మాట్లాడారు. డ్రగ్స్ రహిత సమాజం సమాజ అభివృద్ధి, సంక్షేమానికి సంకేతమని పేర్కొన్నారు. విద్యార్థులు మంచి క్రమశిక్షణతో మెలగాలని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇమ్మానుయేల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కౌతాళంలో మాట్లాడుతున్న ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి

కోసిగిలో...

హొళగుందలో మాట్లాడుతున్న ఎస్ఐ పెద్దయ్య నాయుడు

గోనెగండ్లలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సిఐ

గుంతలు పూడ్చిన అధికారులు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ఆదోని

కొత్త ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఎక్కే చోట గుంతకు ప్యాక్ వేసిన అధికారులు

'ఇలా ఉంటే ప్రమాదాలు జరగవా..?' అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. శ్రీనివాస భవన్ నుంచి కొత్త ఫ్లైఓవర్ బ్రిడ్జి వరకు గుంతలు పూడ్చడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టణంలోని గుంతల రోడ్ల వల్ల వాహన దారులు ఇబ్బందులు పడ్డారు. చిన్నపాటి వర్షం వచ్చినా పట్టణంలోని కొత్త ఫ్లైఓవర్ బ్రిడ్జిపై గుంతల్లో నీరు నిల్వ ఉండేది. ఇసుక, సిమెంట్, కంకర మిశ్రమంతో పూడిపించామని అధికారులు తెలిపారు. గుంతల కారణంగా బైక్, ఆటోలు అదుపు తప్పి ప్రమాదాలు జరిగి కొందరు గాయాలు పాలైన ఘటనలు కూడా ఉన్నాయి. పట్టణంలోని అన్ని చోట్లా గుంతలు పూడ్చి ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మంత్రిని కలిసిన ఎమ్మెల్సీ బిటి

ప్రజాశక్తి - ఆదోని

పుష్పగుచ్ఛం అందజేసి మంత్రిని అభినందిస్తున్న బిటి

వెలగపూడి సచివాలయంలో మంత్రి వీరాంజనేయ స్వామిని ఎమ్మెల్సీ బిటి.నాయుడు కలిశారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమం, విభిన్న ప్రతిభావంతులు, వయో వృద్ధుల సంక్షేమం, సచివాలయం, గ్రామ వాలంటీర్ శాఖల మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన డోల బాల వీరాంజనేయ స్వామిని బుధవారం ఆయన ఛాంబర్‌లో ఆదోని నుంచి ఎమ్మెల్సీ బిటి.నాయుడు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. సాంఘిక సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

- ఎస్‌టియు రాష్ట్ర సహాధ్యక్షులు నాగరాజు

ప్రజాశక్తి - ఆదోని

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎస్‌టియు రాష్ట్ర సహాధ్యక్షులు సి.నాగరాజు, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్ నాయుడు కోరారు. బుధవారం ఆదోనిలోని కార్యాలయం వద్ద ఎమ్మెల్యే పార్థసారథిని సన్మానించి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ... అప్‌గ్రేడ్ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాలని, సిపిఎస్‌ను రద్దు చేయాలని కోరారు. ఒపిఎస్‌ను పునరుద్ధరించాలని, విద్యార్థులకు అనుగుణంగా ప్రభుత్వ పాఠశాలలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఐఆర్‌ను వెంటనే ప్రకటించాలని, ఆర్థిక బకాయిలను విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర కౌన్సిలర్ జి.వీరచంద్ర యాదవ్, ఎస్‌టియు అసోసియేట్ అధ్యక్షులు పి.నాగేంద్రప్ప, జిల్లా కౌన్సిలర్ నరసింహులు, ఆదోని పట్టణ శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవి, భీమరాజు, నాయకులు రాజా సతీష్, ఉరుకుందప్ప, ప్రహ్లాద, రామయ్య, నాగప్రసాద్, జ్యోతి మూర్తి, నారాయణ, అయ్యప్ప, కాశీ విశ్వనాథ్, శ్రీనివాసులు, భాస్కరాచారి, గంగ నాయక్, వెంకట్రామిరెడ్డి, నాగేంద్ర గౌడ్, జయరామ్, నిరంజన్ రెడ్డి, శ్రీరాములు, ప్రసాద్, కల్యాణ్ రావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

ఎల్ఎల్‌సి గట్టుపై

పందులు కాల్చకుండా చర్యలు తీసుకోవాలి

- పంచాయతీ అధికారులకు గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి - హొళగుంద

ఎల్ఎల్‌సి గట్టుపై పందులను కాల్చకుండా మేజర్ పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. పందులను కాల్చడం వల్ల అక్కడున్న బూడిద వేస్ట్ కాలువలో కలిసిపోయి ఆ నీరు కలుషితమై రోగాల బారిన పడుతున్నామని తెలిపారు. ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోందని చెప్పారు. ఎక్కడైనా కొండలగుట్టల్లో పందులను కాల్చుకోవాలని, ఇలా అందరికీ ఉపయోగపడే సాగు, తాగునీరు వెళ్లే ఎల్ఎల్‌సిపై ఇలాంటి చట్టవ్యతిరేక పనులు చేపట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఇప్పటికైనా మేజర్ పంచాయతీ అధికారులు స్పందించి పందులను కాల్చకుండా చర్యలు చేపట్టాలని కోరారు. లేకపోతే సంబంధిత అధికారుల కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పందులను కాలుస్తున్న దృశ్యం

IN THE COURT OF THE II ADDL. DISTRICT JUDGE KURNOOL AT ADONI
O.S.NO. 15/2018

Between:-
Smt. Edula Bharathi @ Challa Chandramma. ...PLAINTIFF
Vs
Challa Yerri Swamy & 4 others. ...DEFENDANTS

TO
D2) Smt. Lavanya w/o Rajesh
D/O Yerri Swamy R/O H.No. 27/78,
Ramachandrapuram village Post Rathana,
Pathikonda Mandalam, Kurnool District

The abovenamed Plaintiff filed the above suit against you and four others for Partition and separate possession of her half share in the suit schedule lands. You are hereby summoned to appear before this Hon'ble Court on 12.07.2024 at 10.30 A.M. in person or through Pleader to file your claim objections failing which the matter will be decided and determined in your absence.

A. M.JANARDHAN GOUD
S. VENKATA REDDY &
A. LAKSHMI NARAYANA
ADVOCATES KURNOOL/ADONI